# గతకల దారి

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

చీకటి పడింది. స్టేషన్‌కు బయటవున్న విద్యుద్దీపాలలో కొన్ని వెలగడంలేదు. ఆ సగంసగం వెలుతురులో మనుషులూ, మనుషుల నీడలు కలిసి చిత్రవిచిత్రంగా కదులుతున్నాయి. ప్లాట్‌ఫారం మీదికి రైలు వచ్చింది. బండివాళ్ళ కేకలు, ప్రయాణీకుల హడావిడీ, కూలీల అరపులు, ముష్టివాళ్ళ మూలుగులు అన్నీ కలసి ఒకే శబ్దంగా వినిపిస్తున్నాయి. బళ్ళవాళ్ళంతా ప్రయాణీకులకు స్వాగతమిచ్చి తమ బళ్ళలోకి ఆహ్వానిస్తున్నారు. అదృష్టవంతులకు మంచి బేరాలు దొరుకుతున్నాయి, లేనివాళ్ళకి లేదు.

బండిలో కునుకు తీస్తున్న వెంకయ్య లేచి, ఆవులించి, వొళ్ళు విరుచుకుని నిద్ర మత్తు వదుల్చుకోడానికి ప్రయత్నించాడు. కాని యింకా బద్ధకంగానే వుంది. కొంచెం దూరంగా తన ఎద్దు పడుకుని నింపాదిగా గడ్డి మేస్తూంది. వెంకయ్య లేచి నిలబడి బండిపూసి, కనబడినవాళ్ళను "బండి కావాలా బాబూ" అని అడుగుదామనుకుంటూ మానేస్తున్నాడు బద్ధకంమూలాన. రైలు దిగిన ప్రయాణీకులు కొందరు జట్కాలమీద, కొందరు రిక్షాలమీద, కొందరు నడిచీ పోతున్నారు. ఎక్కువ సామాన్లుంటేనే తప్ప ఒంటెద్దుబండీ ఎవడెక్కుతాడు? అంచేతే ఊళ్ళో యీ బళ్ళు తగ్గిపోయాయి. ఆరోజు స్టేషన్ దగ్గర వెంకయ్య బండి వొక్కటే ఎద్దుబండి. అయినా బేరం రావడంలేదు.

"మెయిలెల్లి పోయిందేట్రా, ఎల్లయ్యా" అన్నాడు వెంకయ్య రెండడుగులు ముందుకు వేసి.

"ఆ...ఎంతసేపని కూకుంటాది."

"ఎంతకు కట్టినావ్ బేరం?"

"రూపాయి. దాసన్నపేట. నువ్వేటలా నిలబడ్డావ్?"

"బేరం నేదెస్"

"అడుగో ఎనకాల సావుకారొస్తున్నాడు, సూడు, సూడు. గొప్ప పిసనారిలే" అని రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు ఎల్లయ్య.

వెంకయ్య ఆ షాహుకారి ఎవడా అని చూస్తున్నాడు. షాహుకారి పావుగంటయి బళ్ళవాళ్ళతో బేరమాడిఆడి ఏమీతోచక నిలబడ్డాడు. అప్పటికే బళ్లవాళ్లంతా వెళ్లిపోయారు. షాహుకారి దగ్గర ఒక చిన్న మూటతప్ప మరేం సామానులేదు. షాహుకారి మూట పట్టుకొని మెల్లగా అడుగులు వేసుకుంటూ తనవేపు రావడం చూసి 'ఇది నడిచివెళ్లే బాపతు కాదులే' అనుకున్నాడు వెంకయ్య.

"ఏయ్, బండి కడతావా?"

"మరెందుకున్నాను బాబూ, చెప్పండి ఎక్కడికో" అన్నాడు వెంకయ్య బద్ధకంగా ఆవులిస్తూ.

"కంటోన్మెంటు పోస్టాఫీసు దగ్గరికి."

"సాల దూరం బాబూ, రూపా యవుతాది."

"రూపాయే. ఎవడేనా నవ్వుతార్రా నాయనా. ఒరే, నలభైమైళ్ళ దూరం రైలు మీద రూపాయి టిక్కెట్టు కొనుక్కుని వస్తే మైలుదూరంకూడా లేదుకదా, రూపాయేమిటి, న్యాయమేనా చెప్పు."

"కంటోన్మెంటు పోస్టాఫీసుకాడికి రైలు బండి నేదు. ఉంటే ఆడు అణాకే తీసుకెళ్లును."

"ఈ అధిక ప్రసంగమంతా ఎందుకు? ఇంతకీ బండి కడతావా కట్టవా?"

"ఎందుకు కట్టను బాబూ. కాని, రూపాయవుతాది."

"తగ్గవా? అర్ధరూపాయిస్తాను."

"ముప్పావళాకి తక్కువ రాను బాబూ."

సాహుకారి స్థితి గ్రహించేడు వెంకయ్య. 'వీడు నడిచి పోగలిగేవాడులా లేడు. బళ్ళ వాళ్ళంతా వెళిపోయారు. ఎవడికోసం యిస్తాడు, ఏం, లేనివాడా?' అనుకున్నాడు మనసులో వెంకయ్య.

"సరే, కానీ" అంటూ సాహుకారి మూట బండిలో పడేసి తనుకూడా ఎక్కి కూర్చున్నాడు.

బండి మెల్లగా చీమలా నడక ప్రారంభించింది. వెంకయ్య బండి కొమ్ముపట్టుకుని నడుస్తూ బండి తోలుతున్నాడు.

"ఒరే అబ్బీ, మహాకుదుపురా నీబండి, ఇంటికెళ్లేసరికి ఒళ్లంతా నొప్పులు పడుతుంది" అన్నాడు సాహుకారి. నడుస్తూ బండి తోలుతున్న వెంకయ్య వెనక్కితిరిగి చూశాడు. చీకట్లో సాహుకారి మొహం కనబడలేదు.

"ఏటి బాబూ, ఏటన్నారు, కుదుపా? అసలు రోడ్డు మంచిదికాదు బాబూ. ఒట్టి గతకలదారి, ఏటి సెయ్యమంటారు సెప్పండీ...నెగయ్యా, నెగు నెగు...తప్పుకో బాబూ...టుర్...టుర్...ఒహోహో, ఏటీ గొడ్డు....నీ తల్లిసిగ గొయ్యా.....పోగాలమంటే నీకు...నడవలేవా తిన్నగా...డొక్క సీరేస్తాను తెలిసిందా...ఊ...నడు..."

"కొట్టకురా కొట్టకు. నోరులేని జంతువు నెందుకలా బాదేస్తావ్?"

"సూడండి బాబూ...దొంగగొడ్డు...దీని తల్లిసిగగొయ్యా తిన్నగా నడవక దిక్కులు సూస్తాది. ఎక్కడేనా గడ్డిపరక కనబడితే నడక మానీసి మూతిపెడతాది...ఛత్తెరీ..."

"దానికి తిండి సరిగ్గా పెట్టవుకాబోలు."

"ఎందుకు నేదు బాబూ. ఏదో గడ్డి గాదరా తినకపోతే ఎలా బతుకుతుంది?"

"మంచి తిండి పెట్టాలికదా?"

"ఖరీదైన దానా ఎట్టమంటారేటి, మంచోరే, మాకే నేదు మంచి తిండి... అయినా ఉన్నకాడికో ఉలవగింజ వాడేస్తామనుకోండి."

"అందుకే అది చచ్చేటట్టు వుంది."

"దాని తీరేఅంత బాబు. ఇంతకుముందు నాకాడ రెం డెద్దు లుండేయి. ఎలాం టెద్దులంటారు? మహా గనమైన ఎద్దులు బాబు! ఆటికిమాత్రం ఏటి పరవాన్నం ఎట్టేమేటి. ఎలాగుండే వంటారు? సింవాల్లాగుండేయి బాబు. తరవాత సచ్చిపోనాయనుకోండి. ఏ దుండిపోతాది చెప్పండీ, మనంమాత్రం వుండిపోతా మేటి? ఇదేనా మంచి ఎద్దే బాబూ. అలాగుందిగానీ మహా గట్టిది. నింపాదిగా ఎల్లినా ఎంతదూరమైనా ఎల్లగలదు. ముసలయిపోయినా నాలాగే దానిదికూడా గట్టిశరీరం బాబూ. సూడండి, నాకింత

వొయసు వొచ్చిందికదా అయినా రాయినా గున్నాను. సీకట్లో కొంచెం చూపు ఆనదు అంతే. నాకంటె సిన్నోళ్లు నాకళ్ళముందే ముసిలయి ఎల్లిపోనారు బాబూ, ఈ గటాని కింకా కాలం మూడనేదుగాని."

"దృష్టి సరిగ్గా లేదంటున్నావు. బహు చీకటిగావుంది. బండి దేనికేనా గుద్దించేగలవు జాగ్రత్త సుమా."

"లేదు బాబు ... రోజూ తోలుతున్న వోడినేకదా. అసలు ఎద్దుకి దారి అలవోటే బాబూ. బళ్లొస్తే అదే తప్పుకుంటాది ... తప్పుకో నాయనా ... తప్పుకో...టుర్... టుర్ ... తప్పుకోవయ్యా నాయుడూ ... ఇయాలా నిన్నా బాబూ, సిన్నప్పటినుంచి తోలుతున్నాగదా, గుద్దించేస్తానా? చూపు సమంగా నేదంటారూ, నిజమే. ముసలికాలం గదా మరి...అందుకే ఎప్పుడూ సీకటిపడ్డాక బండికొమ్ముపట్టుకు నడుస్తూనే తోలుతాను. కష్టమే అనుకోండీ ... నేకపోతే పొట్ట ఎలా గడుస్తాది బాబూ. పోనీ ఆదుకునేవో డెవడూ నేడాయె. ఒకేఒక గుంటడు. ఆడేదో యింత గంజి పోస్తాడని ఆశపడ్డాను బాబూ. కాని సెడిపోనాడు...మా ఆడదాయికాడ మూడు తులాల బంగారముంటే ఆడే తగలేసినాడు. పోతేపోనీ, ఆడేనా దక్కినాడుకాడు బాబూ ఇల్లొగ్గిసి పారిపోయినాడు. మరి పత్తా నేదు...... ఔను బాబూ......నిజవే... ఎందుకు సెప్పండీ బతికి, సుకం నేక పోయినాక...... నా కళ్లముందు పుట్టి పెరిగినోళ్లు ఎల్లిపోతున్నారు బాబు, ఈ గటాని కింకా కాలం మూడనేదు. బంగారం నాంటి కూతురు సచ్చిపోయింది గదా ... నా ఆడది నానంటే పడిసచ్చేది. ఎన్ని సికాకులు పడింది బాబూ ... నాను తప్పతాగి సితకదన్నినా నానంటే పడిసచ్చేది...మీకు తెలీదు బాబూ, బూదేవినాంటి ఆడది... నాకు మరి దక్కనేదు. బొట్టికోసం, బొట్టెడు కోసం బెంగెట్టుకుసచ్చిపోయింది...దానికెన్ని బాదలు పెట్టినాను ... దాని ఉసురు నాకు తగిలింది బాబూ. సేసినపాపం ఎక్కడికి పోతాది సెప్పండి ? అందుకే నాకేటి మిగిలింది బాబూ? ఏమిటి మిగిలింది?...

"సిన్నప్పుడెంత జలసాగా బతికినాను బాబూ...సెబితే నమ్మరుగాని వోరానికి నాలుగైదుసార్లు సుక్క పడవలసిందే. ఇంటికాడ మాంసంగాని, సేపలుగాని కూర నేకపోతే మెతుకు పొక్కేది కాదు...రోజుకు రెండుమూడు రూపాయిలు దొరికేవి బాబూ, సెప్తే నమ్మరుగాని. ఆ రోజుల్లో ఏటి అంతా కారుసవక గదా......మహాజలసాగా ఎల్లేది ఎవ్వారం. ఎక్కడలేని సుట్టాలూ వొచ్చి తినేవారు బాబూ. మరిప్పుడో..........

"...సేతిలో బెల్లం ఉన్నంతవరకే
కాకి బల్లమంటూ
సేతిలో బెల్లం జారిపోయిన
ఎవరురారు వెంట"...

అంతేబాబు నోకం, అంతే ... కట్టుకున్న ఆడది నేక, కావలసినోల్లు నేక, సుట్టాలు పక్కాలు నేక ఒంటెద్దుబండినాగ ఎందుకు బాబూ యీ జలమ? ... బాబూ నిద్దరోతున్నారేటి ? వొచ్చేసినాము అదుగో ఆ మలుపు తిరిగితే అదే ... ఇదొక గతకలదారి బాబూ ... రోడ్డు సన్నం, రద్దీ ఎక్కువ. గూడుసెడ్డు సామాన్లబళ్లు, ఫేకటరీబళ్లు, పల్లెటూరోళ్ళ సంతబళ్ళూ అన్నీ యిక్కడే తగుల్తాయి బాబూ ... టుర్, టుర్...నెగు,

నెగు, తప్పుకోవయ్యా తప్పుకో ... ఏయ్ బండోడా, ఎడవఁకి తోలురా ఎడవఁకి ... అరెరె ... పల్లెటూరి బైతులు ... నిద్దరో తున్నావేట్రా ... అరెరె ... సూసుకోవేం, కల్లునేవేటి ? ఓరి నీ ..."

ఒంటెద్దుబండి మరొక బండికి గుద్దుకుంది. ప్రమాదమేమీ లేదుకాని కొద్దిగా సందడి జరిగింది. జనం మూగేరు.

ఆ స్థలంవద్ద రోడ్డుదీపం వెలగడంలేదు. ఆ చీకటిలో ఒకరి మొహాలు ఒకరికి సమంగా కనబడకపోయినా 'నీదితప్పంటే నీదితప్పని' పోట్లాట జరిగింది. దారిపోయే పెద్దమనుషులు, చుట్టుపట్ల దుకాణదారులు వచ్చి తగవు తీర్చగానే ఎవరుమాన వారు చెదిరి పోయారు. మళ్లీ బండి నడక ప్రారంభించింది. బండికొమ్ము పట్టుకుని నడుస్తూ వెంకయ్య ఆ పల్లెటూరి బండివాడిని బూతులు తిడుతూ బండి తోలుకెళ్తున్నాడు.

"సూడండి బాబూ, పల్లెటూరి నంజాకొడుకు ఈడి తల్లీసిగగొయ్యా. కుడిసేతి పక్కనుండి బండి నడుపుతూ నాది తప్పంటాడు. పోలీసుజవాను నేడక్కడ. ఉంటే ఆడి పనౌను. నాకు సూపు సమంగా ఆనదు నిజవేఁ కాని తప్పెవడిదో మీరే సెప్పండి... బాబూ, నిద్దరోతున్నారా ?" అని బండిలోకి తొంగి చూశాడు వెంకయ్య. బండిలో షాహుకారి లేడు. బండి నిలబెట్టి, వెనక్కి పరుగెత్తి బండి గుద్దుకున్నచోటికి వెళ్ళి చూశాడు. షాహుకారి కనబడలేదు. కేక లేశాడు, బూతులు తిట్టేడు, మొత్తుకున్నాడు.

వెంకయ్య మరి యింటికి వెళ్ళలేదు. ఎందుకూ యింటికి ? బండి మళ్ళీ స్టేషనుకే తోలుకుపోయాడు.

---

కామార్తా హి ప్రకృతికృపణా
శ్చేతనాచేతనేషు॥

కామోద్రిక్తులైనవాళ్ళకి ఇది ప్రాణీ, ఇది ప్రాణం లేనిదీ అనే జ్ఞానం వుండదు.

♦ ♦ ♦

యచ్ఞా మోఘా వర మధిగుణే
నాధమే లబ్ధకామా॥

నీచుడు ఇస్తే పుచ్చుకోడంకన్న ఉత్తముణ్ణి అడిగి లేదనిపించుకోడం మేలు.